## కేసీఆర్ క్రికెట్ కప్ విజేతలకు ట్రోఫీ అందజేత



కేసీఆర్ క్రికెట్ కప్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హనుమకొండ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బర్త్ డేను పురస్కరించుకొని నిర్వహించిన క్రికెట్ చాంపియన్ షిప్-2024 టోర్నమెంట్ విజేతలకు కేటీఆర్ మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ట్రోఫీ అందజేశారు. ఇందులో మొత్తం 40 జట్లు పాల్గొనగా, 51వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగ్ టీమ్ మొదటి స్థానం, 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచాయి.

## విశ్వాస ఘాతకులకు బుద్ధి చెప్పండి..

అన్ని అవకాశాలు ఇచ్చిన బీఆర్ఎస్‌ను మోసం చేసిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్ విశ్వాస ఘాతకులు అని కేటీఆర్ అన్నారు. 'కడియం శ్రీహరి 2013లో పార్టీలోకి వచ్చిండు. రాగానే ఎంపీ, ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులు ఇచ్చినం. కేసీఆర్ పదేండ్లలో కడియం శ్రీహరిని మూడు చట్టసభల్లోకి పంపించాడు. కడియం శ్రీహరి నయవంచకుడు. నమ్మించి గొంతు కోశాడు. కేసీఆర్ సార్ కడియం బిడ్డకు టికెట్ ఇచ్చిండని నాకు ఫోన్ చేసిండు. కేసీఆర్ ఆశీర్వాదం తీసుకుంటాను కలవాలని అడిగిండు. నేను కేసీఆర్ పీఏలకు చెప్పి పంపిన. మరుసటి రోజు కుటుంబంతో కలిసి కేసీఆర్‌ను కలిసి అక్కడే భోజనం చేసిండు. సాయంత్రం వరకు అక్కడే ఉన్నడు. కడియం బిడ్డ కావ్య నాకు ఫోన్ చేసి వాళ్ల ఆయన ఆంధ్రా అని కేసీఆర్‌కు ఫ్యాన్ అయ్యిండని చెప్పింది. ఏమైందో తెలియదు మరుసటిరోజు సాయంత్రం లేఖ పంపిండు. ఇంత ద్రోహం, మోసం, అన్యాయం ఎక్కడైనా ఉంటదా? నయవంచకుడు, తడిగుడ్డతో గొంతు కోసేవాడు కడియం శ్రీహరి. పార్టీ మారుడు తప్పు కాదు. ద్రోహం చేసుడు తప్పు. అరూరి రమేశ్ అంతే. రమేశ్‌కు బీఆర్ఎస్ ఎన్నో అవకాశాలు ఇచ్చింది. కడియం, అరూరి ఇద్దరు విశ్వాస ఘాతకులు. అరూరి రమేశ్ బీజేపీకి పోయిండు. నమ్మించి గొంతుకోసుడు బరాబర్ తప్పు. సుధీర్‌కుమార్ కేసీఆర్ వెన్నంటి ఉన్న నాయకుడు. అందరం కష్టపడి పని చేస్తే సుధీర్‌కుమార్ గెలుపు సాధ్యమవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులపై, కార్యర్తలపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నది. ఎక్కడి వాళ్లు అక్కడే కష్టపడితే ఏడాదిలోపు బీఆర్ఎస్ రాష్ర్టాన్ని శాసించే అవకాశం ఉంటుంది. ఫలితాలు మనకు అనుకూలంగా ఉంటే ఏ అధికారైనా, పోలీసు అయినా భయపడుతరు. వరంగల్ మొదటి నుంచి బీఆర్ఎస్ గడ్డ. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందాం' అని కేటీఆర్ అన్నారు.



మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్

# కష్టపడితే గెలుపు మనదే

## తెలంగాణ కోసం కొట్లాడే కేసీఆర్‌కు అండగా ఉండాలి

## ప్రజలు మరోసారి మోసపోవద్దు

- కాంగ్రెస్‌ది ఎన్నికల ముందు అభయహస్తం.. తర్వాత భస్మాసుర హస్తం
- కడియం శ్రీహరి, అరూరి రమేశ్ విశ్వాస ఘాతకులు
- బీజేపీ అక్షింతలు పంచితే కేసీఆర్ దేశానికి బియ్యం పంపాడు
- కేసీఆర్ రావాలన్నా.. తిరిగి శాసించాలన్నా 10కి పైగా ఎంపీ సీట్లు గెలవాలి
- వరంగల్ లోక్‌సభ ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల విస్తృత స్థాయి సమావేశం



హనుమకొండలో భారీ స్క్రీన్‌పై కేసీఆర్ లైవ్ ఇంటర్వ్యూ చూస్తున్న పార్టీ కార్యకర్తలు, అభిమానులు

*హనుమకొండ/కరీమాబాద్, ఏప్రిల్ 23 : గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయిన ప్రజలు మరోసారి ఆ తప్పు చేయవద్దని, తెలంగాణ కోసం కొట్లాడే కేసీఆర్‌కు అండగా నిలువాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కోరారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వరంగల్ తూర్పు, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'ప్రజల కోసం పోరాడే సత్తా కేసీఆర్‌కు ఉంది. అందుకే ఆలోచించి ఓటు వేయాలి. మరోసారి ఆగమైతే గోస పడుతాం. వరంగల్ మొదటినుంచీ బీఆర్ఎస్ గడ్డ అని, కష్టపడితే వరంగల్‌లో గెలుపు మనదే. విశ్వాస ఘాతకులు కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పి బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించుకుందామ'ని పిలుపునిచ్చారు.*

### ఎన్నికల ముందు అభయహస్తం.. తరువాత భస్మాసుర హస్తం

గత ఎన్నికల వేళ బూటకపు మాటలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది ఎన్నికల ముందు అభయహస్తం.. తరువాత భస్మాసుర హస్తం అని విమర్శించారు. మొదటిసారి మోసపోతే అది మోసం చేసిన వారి తప్పు అని, మరోసారి మోసపోతే అది మన తప్పవుతుందన్నారు. మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ 100 రోజుల్లో చేస్తానన్న హామీలను అమలు చేయలేదన్నారు. మళ్లీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఇక హామీలు అసలు అమలు చేయరన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మోసం-1 చూపిన కాంగ్రెస్ మోసం పార్ట్-2 చూపుతుందన్నారు. హామీలు అమలు చేయకుండానే మళ్లీ ఓట్ల కోసం వస్తుందన్నారు. కాంగ్రెస్‌కు భయం పుట్టాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కష్టపడితే వరంగల్‌లో గెలుపు మనదేనన్నారు. ఇక కేంద్రంలో బీజేపీ వచ్చాక ధరలు భారీగా పెరిగాయన్నారు. కేసీఆర్ ఎన్నో యాగాలు చేశారు.. ఆలయాలను నిర్మించారన్నారు. కానీ దేవుడితో ఏనాడూ రాజకీయం చేయలేదన్నారు. సమావేశాల్లో లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజుయాదవ్, వాసుదేవరెడ్డి, మెట్టు శ్రీనివాస్, బొల్లం సంపత్, రైతు కో ఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు పల్లం పద్మ, సిద్దం రాజు, మరుపల్ల రవి, బోగి సువర్ణ, టీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్, జోరిక రమేశ్, చింతల యాదగిరి, జనార్దన్‌గౌడ్ పాల్గొన్నారు.



వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్సీలు బస్వరాజు, పోచంపల్లి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, నన్నపునేని, చల్లా, రాజయ్య తదితరులు

### దేవుళ్లపై ప్రమాణం కాదు.. గవర్నర్‌కు లేఖ రాయి

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

ఆగస్టు 15వ తేదీ వరకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ప్రమాణం చేయడం కాదు.. చేయకపోతే ప్రభుత్వాన్ని రద్దు చేస్తానని గవర్నర్‌కు లేఖ రాసివ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సవాల్ విసిరారు. తాను చేయించిన సర్వేల్లో వర్ధన్నపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కే అధిక మెజార్టీ ఉందని, 50వేల మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. కేసీఆర్‌ను ఓడగొట్టి తప్పు చేశామని, బీఆర్ఎస్ పార్టీని మోసం చేసిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌పై ప్రజల్లో కసి, కక్ష పెరిగిందన్నారు. వరంగల్ పార్లమెంట్‌లో ఉద్యమకారుడు, నిజాయితీపరుడు, మచ్చలేని డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్‌ను కేసీఆర్ ఎంపిక చేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు అబద్ధాలు ఆడి అధికారంలోకి వచ్చారని.. మళ్లీ మోసం చేయాలనే చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని పట్టుకొని ఉన్న వారిని దగ్గరకు రానివ్వకుండా కోటరీ ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో పదవులు పొంది, మోసం చేసిన వారిని తొక్కిపెట్టాలన్నారు.

### ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రా.. చూసుకుందాం

**- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య**

'దళిత ద్రోహి, నయవంచకుడు, దుర్మార్గుడు కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రా.. చూసుకుందాం' అని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సవాల్ విసిరారు. వర్ధన్నపేట దళితుల హక్కులను కాలరాసిన మోసకారి కడియం శ్రీహరి అన్నారు. కడియం శ్రీహరి బిడ్డ కావ్య కులంతోపాటు మతాన్ని సైతం అవమానపరుస్తోందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధిని అడ్డుకున్నాడని, సింగపూర్, మలేషియా దేశాల్లో ఆస్తులు కూడబెట్టాడని, కడియం శ్రీహరి జీవితమంతా ఎర్రబెల్లికి తెలుసని చెప్పారు. తెలంగాణలో మాదిగ సామాజిక వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించని దుర్మార్గుడు సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కడియం, అరూరి పోవడంతో బీఆర్ఎస్‌కు శని పోయిందన్నారు. ఇప్పుడు ఉన్నవారంతా నిఖార్సయిన తెలంగాణవాదులు, ఉద్యమకారులేనని పేర్కొన్నారు. ఇక నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఏ ఎన్నిక వచ్చినా కడియంను చెడుగుడు ఆడుకునుడేనని రాజయ్య హెచ్చరించారు.

### కేసీఆర్ వైపే ప్రజలు

**- డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి**

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని ఓడించి తప్పు చేశామని ప్రజలు, రైతులు బాధపడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి వెళ్లిన కడియం, అరూరి ఒకే పుట్టలోని పాములే. కడియం కావ్య, అరూరి రమేశ్ ఇద్దరికీ కడియమే గురువు. తప్పు చేశామని రాష్ట్ర ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు చూస్తున్నరు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలనే జోష్ వచ్చింది. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదు. అబద్ధపు, మోసపూరిత హామీలతో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. కేంద్రంలోని బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ సామాన్యుల నడ్డివిరుస్తోంది. ఇలాంటి పార్టీలను తిప్పికొట్టాలి. కేసీఆర్ పాలన అంతా రామరాజ్యం. అందరూ నన్ను దీవించి భారీ మెజార్టీతో గెలిపించాలి.

---

## వరంగల్‌లో 7, మానుకోటలో 6

**బీఆర్ఎస్ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి కవిత నామినేషన్**

వరంగల్, ఏప్రిల్ 23(నమస్తేతెలంగాణ)/మహబూబాబాద్: వరంగల్‌లో 7, మహ బూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి 6 నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్‌లో స్వతంత్ర అభ్యర్థులుగా ఇల్లందుల శోభన్‌బాబు, కొంగర అనిల్‌కుమార్, కుమ్మరి కనకయ్య, పోతరాజు నరసింహరాజు, చెలుముల్ల సుజాత, పొగాకుల అశోక్, విదుథలై కాచి పార్టీ అభ్యర్థి మచ్చ దేవేందర్ తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్యకు అందజేశారు. మహబూబాబాద్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ తరఫున మాలోత్ కవిత నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా బానోత్ భావ్‌సింగ్, పోరిక శ్యామల నాయక్, ఆధార్ పార్టీ అభ్యర్థిగా జాటోత్ రవివర్మ మరోమారు నామినేషన్ దాఖలు చేశారు. ఆదివాసీ జేఏసీ తరఫున చందా లింగయ్య, సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణ నామినేషన్ పత్రాలను ఆర్వో, కలెక్టర్ అద్వైతకుమార్‌సింగ్‌కు అందజేశారు.



మహబూబాబాద్‌లో నామినేషన్ కేంద్రం వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత, ప్రజాప్రతినిధులు

# మీరే నా బలగం

## ఈ ఎన్నికల్లో నాకు భారీ మెజార్టీ ఇవ్వాలి

## కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

- కాంగ్రెస్, బీజేపీలు చేసిందేమీ లేదు : ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత
- కేసీఆర్ ప్రతి రైతుకు లబ్ధిచేశారు : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- తండాలను అభివృద్ధి చేసింది కేసీఆరే : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- ప్రతి పేదవాడికి న్యాయం : ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

*మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : 'మానుకోట ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారు. వారిపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. నా బలం, బలగం నా పార్టీ కార్యకర్తలే. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సైనికుల్లా పని చేసి నన్ను భారీ మెజార్టీ గెలిపించాలి. ప్రతి ఒక్కరు సమన్వయంతో ముందుకుసాగాల'ని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత పిలుపునిచ్చారు. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, ఆ విషయం మొన్నటి మానుకోట సభతోనే అర్థమైపోయిందని, అలాగే పదేళ్ల మోదీ సర్కారు పాలనతో పేదల ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ఈ రెండు పార్టీలకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. మంగళవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి కవిత నామినేషన్ వేశారు.*



### రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మరు: కవిత

అమలుకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తున్నదని ఎంపీ కవిత అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ కాంగ్రెస్ అమలు చేయలేదని, ఫలితంగా రాష్ట్రంలో సాగు, తాగునీరు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, ఆ విషయం మానుకోట సభతో కాంగ్రెస్ నాయకులకు అర్థం అయిపోయిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ వైపు ప్రజలు ఉన్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను అరిగోస పెడుతున్నారని, మొదట డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పి మాట మార్చి ఇప్పుడు ఆగస్టు 15న చేస్తానని మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేకపోతే తిరుగుబాటు చేయడం ఖాయమన్నారు. బీజేపీ వివిధ మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రధాని మోదీ పేదలకు చేసిందేమీ లేదన్నారు.

### కాంగ్రెస్ సర్కారు వచ్చీరాగానే రైతులకు కష్టాలు : ఎంపీ వద్దిరాజు

కేసీఆర్ హయాంలో రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికీ రైతుబంధు అందక రాష్ట్రంలోని చాలామంది రైతులు అరిగోస పడుతున్నారు. పంటలు ఎండిపోయి ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని రైతులను ఆదుకోవాలి. కేసీఆర్ నేతృత్వంలో ప్రతి తండాకు, గూడేనికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించారు. కాంగ్రెస్ వచ్చి నీటి తండ్లాట తెచ్చింది. అలాగే కేంద్రంలో పదేళ్లుగా మోదీ సర్కారు కార్మికులు, కర్షకులను అనేక ఇబ్బందులు పెట్టింది. బీజేపీ విధానాలు కార్పొరేటర్లకు అనుకూలంగా ఉన్నాయే తప్ప పేదలకు మాత్రం న్యాయం చేయడం లేదు.

### అందరూ కేసీఆర్ పాలన కోరుకుంటున్నరు : మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

కేసీఆర్ నేతృత్వంలో గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారు. తండాలను ప్రత్యేక జీపీలుగా చేయడం వల్ల ఎంతో మందికి సర్పంచ్‌లు అయ్యే అవకాశం వచ్చింది. ఈ ప్రాంత గిరిజన ప్రజల కోసం మెడికల్ కళాశాల, హార్టికల్చర్, నర్సింగ్, ఇంజినీరింగ్ కళాశాలను తీసుకొచ్చి ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు, కార్మికులు, దళితులు సుఖసంతోషాలతో ఉన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలకు కష్టాలు తెచ్చింది. ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి నట్టేట ముంచింది. అందుకే ఇప్పుడు అందరూ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారు.

### ప్రతిపేద వాడికి న్యాయం : ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు

కేసీఆర్ పాలనలో ప్రతి పేద వాడికి న్యాయం జరిగింది. మండువేసవిలోనూ ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చెరువులను నింపిన ఘనత ఆయనదే. ప్రతి ఎకరాకు నీరందించి, పంటలకు కనీస మద్దతు ధర అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి ప్రజలను మోసం చేస్తున్నది. అందుకే సీఎం రేవంత్‌రెడ్డికి ఆదరణ తగ్గింది. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారు. ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్లు అంగోత్ బిందు, బడే నాగజ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, బానోత్ శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, హరిప్రియా నాయక్, రేగా కాంతారావు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పర్కాల శ్రీనివాసరెడ్డి, ముత్యం వెంకన్న పాల్గొన్నారు.